ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

గురువారం 30 అక్టోబరు 2025



విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కుండపోతగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల వలన విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, వినియోగదారులు అప్రమత్తతతో ఉండి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తడి ప్రదేశాల్లో తడిగా ఉన్న చేతులతో స్విచ్‌లు, మీటర్లు, ప్లగ్‌లు, వైర్లు తాకవద్దని, తెగిపోయిన విద్యుత్ తీగల వద్దకు వెళ్లకుండా లైన్‌మన్‌కు, 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. తక్కువ ఎత్తులో వెళ్లే విద్యుత్ తీగల కింద వాహనాలు నడపవద్దని, పశువులను తీసుకెళ్లవద్దని, పిల్లలను విద్యుత్ పరికరాల దగ్గర ఆడనీయకుండా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల్లో, బోర్‌వెల్‌ల వద్ద పని చేసే సమయంలో తడి నేలపై నిలబడి విద్యుత్ మోటార్ స్విచ్‌లు ఆన్,ఆఫ్ చేయవద్దని, విద్యుత్ పరికరాల్లో తడినీరు ఉంటే వాటిని తొలగించాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలను తాకవద్దని గంగాధర్ సూచించారు.

వరికోతలను వాయిదా వేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచనల మేరకు మొంథా తుఫాన్ ప్రభావం వలన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున రైతులు వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అలివేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వరద నీరు పొలాల్లో నిల్వ ఉండకుండా బయటికి పోయే విధంగా చూసుకోవాలని, పంట పడిపోయిన వరి పొలాల్లో నిలువుగా కట్టలు కట్టితే వర్ష ప్రభావం నుండి పంటను కాపాడుకోవచ్చని ఏవో రైతులకు సూచించారు.

నేడు, రేపు పత్తి మార్కెట్ బంద్

పెద్దపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 30, 31 తేదీల్లో రెండు రోజులపాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు జరగవని ఉన్నత శ్రేణి మార్కెట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల తూకం వేయడం, లోడింగ్ చేయడం సమస్యగా ఉంటుందని, రెండ్రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు ప్రకటించామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు. వాతావరణం అనుకూలిస్తే తిరిగి సోమవారం మార్కెట్లో కొనుగోలు సాగుతాయని తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

కమాన్‌పూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని మంథని డీఎల్‌పీఓ కొమురయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం జూలపల్లి వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో నీటి నిల్వ లేకుండా, రోడ్లపై చెత్తచెదారం ఉండకూదన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీఓ మారుతి, గ్రామకార్యదర్శి అంబటి శంకర్, కారోబార్ బర్ల భూమయ్య పాల్గొన్నారు.

జోరు వాన..

- మొంథా తుఫాన్‌తో జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యం
- పత్తి పంటకు తీరని నష్టం

పెద్దపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. తుఫాన్ ధాటికి రైతులు అతలాకుతలం అవుతున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. వర్షంతో జన జీవనం అతలాకుతలమైంది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. బుధవారం ఉదయం చిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం నుంచి జోరుగా కురుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు 29.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఓదెల మండలంలో 40.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఎలిగేడు మండలంలో 39.0, సుల్తానాబాద్ మండలంలో 38.0, ధర్మారం మండలంలో 36.0, పెద్దపల్లి మండలం 31.6 కాల్వ శ్రీరాంపూర్ మండలంలో 31.0, మంథని మండలంలో 30.2, కమాన్‌పూర్ మండలంలో 27.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రామగిరి మండలంలో 25.0, ముత్తారం మండలంలో 20.8, జూలపల్లి మండలంలో 19.5, పాలకుర్తి మండలంలో 15.5, రామగుండం మండలం 15.2, అంతర్గాం మండలంలో 13.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షాలకు కోతకు వచ్చిన సుమారు 15 వేల ఎకరాల్లో వరి పంట నేల రాలింది. కాపునకు వచ్చిన పత్తి పంట తడుస్తోంది. పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, మంథని పలు మార్కెట్ యార్డులతోపాటు ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసింది. కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ యార్డులో ప్లాట్‌ఫారంలు లేక నేలపైనే పోసిన ధాన్యం కొట్టుకుపోయి మట్టిలో కలిశాయి. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఈ తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులపాటు ఉండే అవకాశాలు కనబడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సింగరేణిలోని ఓపెన్‌కాస్టు గనుల్లో వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది.



కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యం

ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల



ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

అంతర్గాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టుకు ఎగువన గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 50 వేల క్యూసెక్కులు, కడెం నుంచి 4744 క్యూసెక్కులు, వాగులు, వంకల ద్వారా 50701 క్యూసెక్కులు మొత్తం 1,05,445 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ అధికారులు 13 గేట్లను ఎత్తి గోదావరిలోకి 1,05,445 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.1754 టీఎంసీలకుగాను 20.1754 నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు ఎగువ నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరికలు జారీచేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు గ్రామాల్లో చాటింపు చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.1754 నీరు నిండటంతో ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు అధికారులు ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

మానేరు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఓదెల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీ గేట్లు ఎత్తివేసి బుధవారం మానేరు వాగులోకి నీటిని విడుదల చేస్తున్నందున మానేరు పరివాహక

(మిగతా 8వ పేజీలో)

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతులు



మంథని మండలం పుట్టపాకలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ముత్తారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):పరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించవద్దని రైతులు బుధవారం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్నారు. పోతారం- కేశనపల్లి వద్ద జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అధికారులు సందర్శించిన క్రమంలో రైతులు అడ్డుకుని నష్టపరిహారం చెల్లించే వరకు పనులు ప్రారంభించేది లేదన్నారు. యంత్రాలను అడ్డుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మధు సూదన్‌రెడ్డి, ఎస్ఐ రవికుమార్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తాం

మంథనిరూరల్: మండలంలోని పుట్టపాక వద్ద నేషనల్ హైవే పనులలో నిర్వాసితులుగా మారుతున్న రైతులకు మూడు రోజులలో పూర్తి పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో సురేష్ తెలిపారు. పుట్టపాక వద్ద అధికారులు బుధవారం పనులు నిర్వహించారు. కొందరికి పూర్తి పరిహారం అందకపోవడంతో పనులను అడ్డుకోవడానికి ప్రయత్నించగా తహసీల్దార్ కుమారస్వామి ఆర్డీవో సురేష్ వద్దకు పంపించారు. రైతులతో మాట్లాడిన ఆర్డీవో నిర్వాసిత రైతులకు మూడు రోజులలో పరిహారం అందజేస్తామని తెలిపారు. దీంతో హైవే పనులు యధావిధిగా కొనసాగాయి.

భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలి

పెద్దపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి సమావేశంలో మాట్లాడారు. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరగా క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి నిబంధన ప్రకారం అర్హత ఉన్నవాటికి పట్టా అందించే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. 22ఏ రిజిస్టర్ సంబంధించి ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆస్తులు, దేవాదాయ భూముల, ఇతర రిజిస్ట్రేషన్ చేయకూడని భూముల జాబితా సిద్ధం చేయాలన్నారు. మీ సేవా ద్వారా వివిధ అవసరాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లు నిర్ణీత సమయం లోగా వారికి అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి బైపాస్ భూ సర్వే పనులు సకాలంలో పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రామగుండం మారేడుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులు పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య , సురేష్ తహసిల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో పేలిన బాయిలర్

- ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు
- పేలుడు తీవ్రతకు దద్దరిల్లిన పరిసరాలు

6

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టవద్దని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పంచాయతీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 1నుంచి 7 వరకు జిల్లాలోని ప్రతీ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉండకుండా చూసుకోవాలని, ప్రజలు బయట చెత్త వేయవద్దన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను తొలగించాలని, పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాల పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో పన్ను వసూలు తక్కువగా ఉందని, నవంబర్ 7 నాటికి లక్ష్యంలో 60 శాతం పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త వేరుగా సేకరించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఇంటికి శుద్ధమైన తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. డీపీవో వీరబుచ్చయ్య, ఎంపివోలు, అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కమాన్‌పూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపికుంట గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శి తిరుపతిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన కలెక్టర్, అక్రమాలు తేలడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సేవలను టర్మినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని, ఈ పథకం అమలులో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయాన్ని బీఆర్ఎస్వీ నాయకులు ముట్టడించారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సతీష్‌గౌడ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యను సీఎం రేవంత్‌రెడ్డి దూరం చేస్తున్నాడన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖను తనవద్దనే ఉంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి రూ.10 వేల కోట్ల బకాయిలను ఎందుకు విడుదల చేయడం తెలుపాలన్నారు. నిధులు విడుదల చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నూనెటి కుమార్ యాదవ్, మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, సిలివేరి లవన్ కుమార్, కర్ర దేవేందర్ రెడ్డి, ఖాదర్, ఉప్పు శివ కుమార్, బండి సురేష్, పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ఎదుట కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ఆర్ఎఫ్‌సీఎల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కోల్‌సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికులు ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ప్లాంట్ మెయిన్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గేటు ఎదుట బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లోకి మొబైల్ ఫోన్లను, వాహనాలను అనుమతించాలన్నారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు సెమి స్కిల్డ్, స్కిల్డ్ పదోన్నతులు కల్పించాలని, బోనస్ చెల్లించాలన్నారు. ప్లాంట్‌కు లాభాలు రావడం లేదంటూ అధికారులు రూ.10వేల విలువ చేసే గృహోపకరణాలు ఇస్తున్నారని, కార్మికులకు మొండి చేయి చూపుతున్నారని పేర్కొన్నారు. విధుల్లోకి వెళుతున్న జీఎం కుల్బేను కార్మికులు అడ్డుకున్నారు. దీంతో వెనుదిరిగిన ఆయన మెటీరియల్ గేట్ గుండా ప్లాంట్‌లోకి వెళ్లారు. మధ్యాహ్నం వరకు ధర్నా చేసినా యాజమాన్యం నుంచి చర్చలకు ఆహ్వానం రాలేదు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఎన్‌టీపీసీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాయకులు అంబటి నరేష్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు నోచుకోని జేపీఎస్‌లు...

- ఏప్రిల్ నెలలోనే ముగిసిన ప్రొబేషనరీ పీరియడ్
- కాంట్రాక్టు పద్ధతిన నాలుగేళ్ల పాటు విధులు
- ఇంక్రిమెంట్లు, ఇతర ప్రయోజనాలు కోల్పోతున్న కార్యదర్శులు
- క్రమబద్ధీకరణపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినప్పటికీ, సర్వీస్ క్రమబద్ధీకరణ కాకపోవడంతో వారు ఇంక్రిమెంట్లు, ఇతర ప్రయోజనాలు కోల్పోతున్నారు. క్రమ బద్ధీకరణ చేయాలని మొత్తుకుంటున్నా సంబంధిత పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి క్రమబద్ధీకరణకు స్పష్టమైన మార్గదర్శకాలు రాక పోవడంతో జిల్లా అధికారులు ఏమి చేయలేకపోతున్నారని తెలుస్తున్నది.

పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండాలనే లక్ష్యంతో..

గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరిసే విధంగా తీర్చిదిద్దడంతో పాటు పారిశుధ్య నిర్వహణ, వీధి లైట్లు, తాగునీటి సరఫరా, ఇంటింటికి చెత్త సేకరణ, పన్నుల వసూళ్ల, తదితర పనులు సాఫీగా సాగాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శి నియమించాలని నిర్ణయించింది. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులకు తోడు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నియమించేందుకు ప్రభుత్వం నియామకాలు చేపట్టింది. ప్రతిభ ఆధారంగా 2019 ఏప్రిల్‌లో నియామకాలను చేపట్టారు.

జిల్లాలో సుమారు 190 మంది జేపీఎస్‌లను నియమించగా, ప్రస్తుతం 166 మంది పనిచేస్తున్నారు. అప్పటి ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు వారి పనితీరును పరిశీలించి రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇందుకు నాలుగు సంవత్సరాల కాలం పట్టింది. 2023 ఏప్రిల్‌లో ఒప్పంద కాలం ముగియడంతో అదే ఏడాది ఆగస్టులో పంచాయతీ కార్యదర్శులకు పే స్కేలు వర్తింపజేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రెండు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినప్పటికీ క్రమబద్ధీకరణ చేపట్టలేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శులు వివిధ బ్యాచుల్లో నియామకం కావడం వల్ల ఎఫెక్టివ్ తేదీ ఎప్పటి నుంచి ఇవ్వాలనే విషయమై పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో క్రమబద్ధీకరణ ఆలస్యం అవుతున్నట్లుగా తెలుస్తోంది.

కామన్ ఎఫెక్టివ్ డేట్ ఇవ్వాలి

అందరికీ కామన్ ఎఫెక్టివ్ డేట్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నప్పటికీ దీనిపై ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఎఫెక్టివ్ డేట్ ఖరారు అయితేనే ప్రొబేషన్ డిక్లేర్ అయి క్రమబద్ధీకరణకు మార్గం సుగమం అవుతుంది. ఆ తర్వాత శాఖపరంగా, పోలీస్ పరంగా కార్యదర్శులపై విచారణ జరపాల్సి ఉంటుంది. విచారణలో ఎలాంటి రిమార్కులు లేకుంటే కార్యదర్శుల సర్వీస్ క్రమ బద్ధీకరణ పూర్తవుతుంది. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశాలు ఉంటాయని కార్యదర్శులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సర్వీస్ క్రమబద్ధీకరణకు ప్రధానమైన కామన్ ఎఫెక్టివ్ డేట్ ఇవ్వాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతున్నదని, కమిషనర్ నుంచి కొన్ని మార్గదర్శకాలు రావాల్సి ఉన్నాయని, ఈ లోపు పోలీసు విచారణకు కార్యదర్శుల వివరాలను రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు పంపించామని తెలిపారు.

'సిమ్స్' సూపర్

- అత్యాధునిక సౌకర్యాలు
- అన్ని హంగులతో క్లాసు రూములు, హాస్టల్ భవనాలు...
- నాలుగో సంవత్సరంలో పీజీ సీట్లు మంజూరు



6

దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ రాంచందర్‌రావు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్, కలెక్టరేట్ ప్రాంతాల్లో రాత్రివేళల్లో ఒంటరిగాఉన్న వ్యక్తుల చేతిలోని సెల్‌ఫోన్‌లు, హ్యాండ్‌బ్యాగ్‌లను దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న నలుగురు నిందితులను బుధవారం అరెస్టు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. నిందితులు సుల్తానాబాద్‌కు చెందిన మహ్మద్ గౌస్‌బాబా(30), సుభాష్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబిద్(22), సంగారెడ్డికి చెందిన మద్ది సుధాకర్(23), సుభాష్‌నగర్‌కు చెందిన దొబ్బల పవన్(24) ఈనెల 27న అర్ధరాత్రి సమయంలో ఒక ఆటోలో తిరుగుతూ కలెక్టరేట్ ఎదుట ఒక వ్యక్తిని అడ్డగించి, బెదిరించి అతని వద్ద నుంచి 3వేల రూపాయలు బలవంతంగా తీసుకుని పారిపోయారు. ఈ కేసులో నిందితుల కోసం గాలిస్తుండగా కరీంనగర్‌లో పట్టుబడ్డారని సీఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు, హాండ్ బ్యాగ్‌లు ఎత్తుకెళ్లినట్లు నిందితులు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులవద్ద నుంచి 1,700నగదు, ఆటోనుస్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

భూములు సాగు చేసిన వారిపై కేసు

చందుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద ప్రధానకాలువ నిర్మాణంలో భూములు నష్టపోయి, పరిహారం పొంది, భూమిని అక్రమంగా సాగుచేస్తున్న వారిపై కేసునమోదు చేసినట్లు చందుర్తి ఎస్‌ఐ జె రమేష్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మల్యాల గ్రామ శివారులో సర్వే నంబర్ 43, 53, 54, 84, 86లలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువ నిర్మాణంలో భూములు నష్టపోయి, పరిహారం పొందిన మల్యాల గ్రామానికి చెందిన మోత్కుపల్లి తిరుపతి, మోత్కుపల్లి గంగాధర్, దుర్గ కొమురయ్య, బుర్కా ఎల్లయ్య, పోతరాజు రాజేందర్ భూమిని అక్రమంగా సాగు చేస్తున్నారు. వారిని పలుమార్లు హెచ్చరించినా వినకుండా భూమిని సాగు చేస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగించారని చందుర్తి తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుపతి, గంగాధర్, కొమురయ్య, ఎల్లయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సైదాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన గొంగళ్ల శారద(36) అనే వివాహిత వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామానికి చెందిన శారదను 19సంవత్సరాల క్రితం అదే మండలం ఆరెపల్లి గ్రామానికిచెందిన గొంగళ్ల శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా శారద కడుపునొప్పితో బాధ పడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా తగ్గలేదు. దీంతో ఈనెల21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త శ్రీనివాస్ వచ్చి చూసేసరికి శారద అచేతన స్థితిలో పడి ఉంది. ఏమయిందని శ్రీనివాస్ అడుగగా కడుపునొప్పి భరించలేక గడ్డి మందు తాగానని, పిల్లలు జాగ్రత్త అని చెప్పింది. వెంటనే శ్రీని వాస్ శారదను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జమ్మికుంటలోని హాస్పటల్‌కు అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. వరంగల్‌లో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతురాలి తమ్ముడు గుంటి రవిందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు.



కళాశాలలో ల్యాబ్



సిమ్స్ ముఖ ద్వారం

'సిమ్స్' సూపర్

- అత్యాధునిక సౌకర్యాలు
- అన్ని హంగులతో క్లాసు రూములు, హాస్టల్ భవనాలు...
- నాలుగో సంవత్సరంలో పీజీ సీట్ల మంజూరు...

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. 2022లో 150సీట్లతో ప్రారంభమైన మెడికల్ కళాశాలలో 15శాతం ఆల్ ఇండియా కోటా, 7శాతం సింగరేణి ఉద్యో గుల పిల్లలకు కేటాయిం చారు. అన్నీ వసతులు ఉండడంతో ఉత్తర, దక్షిణ ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు ఈ కళా శాలలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఏసీ క్లాస్ రూమ్‌లు, అత్యాధునిక మెడికల్ ల్యాబ్‌లు, హాస్టల్ భవనాలు, ప్రొఫెసర్లు, సిబ్బందికి భవనాలు, ప్రిన్సిపాల్‌కు క్వార్టర్ కేటాయించారు. ప్రొఫెసర్లు అందుబాటులో కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2022లో మొదటి బ్యాచ్ ప్రారంభం కాగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ 4వ సంవత్సరానికి అనుమతి ఇవ్వడంతో రెండో కౌన్సెలింగ్‌లోనే 150సీట్లు నిండిపోయాయి. రాష్ట్రంలో 9 మెడికల్ కళాశాలలు కేటాయించగా 8 కళాశాలల్లో పనులు నత్తనడక నడుస్తున్నాయి. జగిత్యాల, మంచిర్యాలలో భవన నిర్మాణాలు పూర్తికాలేదు. గోదావరిఖనిలో సింగరేణి నిధులు కేటాయించడంతో పనులు పూర్తయ్యాయి. విద్యార్థులు కళాశాలలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 762 పడకల ఆసుపత్రిని అన్ని హంగులతో నిర్మిస్తున్నారు.

● పీజీ సీట్ల మంజూరు...

సిమ్స్ కళాశాలకు 16పీజీ సీట్లను మంజూరు చేసింది. ఎమర్జెన్సీ మెడిసిన్-4, ఎంఎస్ ఆర్థోపెడిక్-4, ఎండీ బయోకెమిస్ట్రీ-4, ఎంఎస్ గైనకాలజిస్ట్-4 సీట్లు మంజూరు చేసింది. 4వ సంవత్సరం పూర్తికాక ముందే ఇక్కడ పీజీ సీట్లు మంజూరు కావడంపై విద్యార్థులు, ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెడికల్ హబ్‌గా రామగుండం
- మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే



రామగుండాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దమే లక్ష్యం. నూతన భవన నిర్మాణం కోసం రూ.142కోట్ల నిధులను మంజూరు చేయించా. మెడికల్ కళాశాలకు అనుబంధంగా రూ.20కోట్ల క్యాత్‌ల్యాబ్ నిర్మాణం, రూ.27కోట్లతో నర్సింగ్ కళాశాల, మరో 100సీట్ల డెంటల్ మెడికల్ కళాశాల అనుమతి ఫైల్ పెండింగ్‌లో ఉంది.

సౌకర్యాలు బాగున్నాయి...
- మధుల, మెడికల్ విద్యార్థిని, కేరళ



సిమ్స్ మెడికల్ కళాశాలలో సౌకర్యాలు బాగున్నాయి. క్లాస్ రూములు, హాస్టల్ భవనం, ఆసుపత్రిలో ప్రాక్టికల్స్, స్టడీ మెటీరియల్ బాగున్నాయి. కేరళ నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నాను.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ
- సాయిప్రసన్న, మెడికల్ విద్యార్థి, మంచిర్యాల



సిమ్స్ మెడికల్ కళాశాల కొత్తది కావడంతో అన్ని సదుపాయాలు ఉన్నాయి. హాస్టల్ కూడా బాగుంది. ప్రొఫెసర్లు పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రోజు గంట యోగా, జిమ్ సదుపాయాలు కల్పించారు.

కళాశాలలో అధునాతన సౌకర్యాలు
- నరేందర్, ప్రిన్సిపాల్, సిమ్స్ మెడికల్ కళాశాల



సిమ్స్ మెడికల్ కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు అవుతుంది. కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వేగవంతంగా పనులు జరిగాయి. విద్యార్థులకు అన్నీ సౌకర్యాలు ఉన్నాయి. ప్రొఫెసర్లకు, సిబ్బందికి క్వార్టర్స్‌ను కేటాయించాం. ఈ ఏడాది పీజీ సీట్లు కూడా మంజూరయ్యాయి. త్వరలోనే కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ అవుతాయి.

నగల షాపులో చోరీ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కొండూర్ కాంప్లెక్స్‌లోగల ఎస్ఎల్ఎస్ జువెల్లరి షాపులో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. షాపు షెటర్ ధ్వంసం చేసి అందులోని ఐదు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. అదేవిధంగా డిస్కౌంట్ స్టోర్ మొబైల్ షాపు షెటర్ ధ్వంసం చేసి దొంగతనానికి యత్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు. వరుస దొంగతనాలతో జమ్మికుంట ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

● ముగ్గురికి జరిమానా

కోల్‌సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జరిమానాతోపాటు ఒకరికి మూడు రోజుల జైలుశిక్షను గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ గురువ విధించినట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు తెలిపారు. మెకానిక్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుతూ రెండోసారి పట్టుబడగా మూడు రోజల పాటు జైలు శిక్షవిధించి కరీంనగర్‌కు తరలించామని, మరో ముగ్గురికి రూ.6వేల జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గన్నేరువరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా కనుగొని బాధితుడికి బుధవారం అందించినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన ఆసరి పర్శరాములు తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ దొరికిన వ్యక్తి సమాచారాన్ని కనుగొని బాధితుడికి అందించినట్లు తెలిపారు.

ఇసుక లారీ, కారు పట్టివేత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు వాహన యజమాని ప్రయాణిస్తున్న కారును ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తేపీరీల దర్గా వద్ద కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై పట్టుకున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మల్లేశం, యజమాని అస్లాం ఖురేషి, సహకరించిన వెంకటేశ్‌లను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో సుల్తానాబాద్ మండలం నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను లారీలో రవాణా చేస్తూ పట్టుబడ్డారని చెప్పారు. లారీ యజమాని అస్లాం ఖురేషి, వెంకటేశ్‌లు కారులో ముందు ప్రయాణిస్తు లారీని పోలీసులు పట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. లారీ, కారును పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చామని తెలిపారు. డ్రైవర్ మల్లేశం, యజమాని అస్లాంఖురేషి, వెంకటేశ్‌లను రిమాండ్‌కు తరలించామని వివరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

ఆన్‌లైన్ రమ్మీతో లక్షలు పోగొట్టుకున్నాడు

● అప్పులు తీర్చేందుకు దొంగతనాలు ● నిందితుడి అరెస్టు ● 12 లక్షల విలువైన బంగారం స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్‌కు అలవాటుపడి లక్షల్లో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయాడు. ఆ అప్పు తీర్చేందుకు దొంగగా మారి చివరకు పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. కరీంనగర్‌రూరల్ ఏసీపీ జి విజయ్ కుమార్ తెలిపినవివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలోని రెవెన్యూకాలనీకి చెందిన మహమ్మద్ ముస్తాక్ సంవత్సరంన్నర నుంచి కోదాడ దగ్గరలోని మేళ్లచెరువు వద్ద బాయిలర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అతను ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్, డాష్ రమ్మీకి అలవాటుపడి తన తల్లిదండ్రులకు తెలియకుండా తన స్నేహితులు, పరిచయస్థుల వద్ద అప్పు చేసి లక్షలు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తిరిగి చెల్లించే మార్గం కనపడకపోవడంతో దొంగగా మారాడు. ఇందుకోసం తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని ఒకే ఇంటిలో రెండుసార్లు చోరీకి పాల్పడ్డాడు. ఆ ఇంటి కిటికీ గ్రిల్‌ను తొలగించి ఇంట్లోకి చొరబడి బంగారం, నగదు దొంగిలించాడు. ఆ తరువాత జూబ్లీనగర్‌లోని దర్గా సమీపంలోని ఒక ఇంటో టీవీ దొంగలించాడు. దొంగిలించిన బంగారాన్ని కరీంనగర్‌లో ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో కోదాడ వెళ్లి అక్కడ విక్రయించేందుకు ప్రయత్నించాడు. అక్కడ కూడా ఎవరూ కొనకపోవటంతో మహమ్మద్ ముస్తాక్ తిరిగి తీగలగుట్టపల్లికి వచ్చాడు. బుధవారం కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది వెంటనే మహమ్మద్ ముస్తాక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలు వెల్లడయ్యాయి. నిందితుడు మహమ్మద్ ముస్తాక్ వద్ద నుంచి 12 లక్షల రూపాయల విలువైన 91 గ్రాముల బంగారం, ఐదు వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు.

ఈ దొంగతనంలో కేసుల్లోని నేరస్తుడైన మహమ్మద్ ముస్తాక్‌ను పట్టుకున్న కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ ప్రకాష్‌గౌడ్, ఎస్‌ఐ లక్ష్మారెడ్డి, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎండి హసనోద్దీన్, కానిస్టేబుల్ ఎన్ శేఖర్, ఎండి ఖలీఫా, రూరల్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు, సల్మాన్‌లను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు. సిబ్బందికి నగదు రివార్డును అందజేశారు.

కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

● రెండు షాపులు పూర్తిగా దగ్ధం ● రూ. 70 లక్షల ఆస్తి నష్టం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదంలో కపిల్ డ్రెస్సెస్‌తో పాటు గణేష్ ఎంటర్‌ప్రైజెస్ గోదాంలోని బట్టలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. మొదట కపిల్ డ్రెస్సెస్‌లో పొగలు రావడాన్ని ఉదయం 6 గంటల ప్రాంతంలో స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారం అందించారు. విషయం తెలియడంతో షాపు యజమాని సాయి సంఘటన స్థలానికి చేరుకుని షటర్ తీయగా అప్పటికే మంటలు వ్యాపించాయి. షాపులోని రెడీమేడ్, ఇతర బట్టలకు మంటలు అంటుకుని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ మంటలు పైఅంతస్థులోని గణేష్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన గోదాంకు వ్యాపించాయి. ఈ సమయంలోనే కరీంనగర్ ఫైర్ సిబ్బంది రెండు ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే షాపులోని సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. గోదాం షటర్ తెరిచేందుకు ఫైర్ సిబ్బంది గంటకుపైగా శ్రమించారు. తెరుచుకోలేక పోవడంతో జేసీబీని తీసుకవచ్చి బలవంతంగా షటర్‌ను, పక్క గోడను తొలగించారు. అనంతరం ఫైరింజన్‌తో మంట లను ఆర్పివేశారు. ఈలోగా గోదాంలోని కెమెరాలకు సంబంధించిన పరికరాలు, బ్యాగ్‌లు, ప్రింటర్లు, కంప్యూటర్ పరికరాలు కాలిపోయాయి. ఈ అగ్ని ప్రమాదంలో కపిల్ డ్రెస్సెస్‌కు 40లక్షల వరకు, గణేష్ ఎంటర్‌ప్రైజెస్‌కు 30లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిం దని బాధితులు సాయి, హరి చెప్పినట్లు జిల్లా అగ్ని మాపకశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కపిల్ డ్రెస్సెస్‌లో విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేశామని యజమాని సాయి తెలిపాడు. అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా లేదా మరేదైనా కారణమా అనేది విచారణ జరుపుతున్నామని జిల్లా ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

ఫైరింజన్ ఆలస్యంగా రావటంతో నష్టం ఎక్కువగా జరిగిందని బాధితులు ఆరోపించారు. కంట్రోల్‌రూం నుంచి ఫైర్ కాల్ రాగానే నిమిషాల వ్యవధిలో తాము సంఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్‌లతో మంటలను ఆర్పివేశామని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు. సంఘటనా స్థలాన్ని వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు పరిశీలించారు.

● కరీంనగర్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంపై అగ్నిమాపక శాఖకు ఆలస్యంగా సమాచారం అందిందని జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనలు జరగగానే నేరుగా అగ్నిమాపక శాఖకు సంబంధిం చిన ఫోన్ నెంబర్లు టోల్‌ఫ్రీ 101, కరీంనగర్ ఫైర్ 2243399, 8712699140, 8712699141, 8712699143కి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై విచారణ జరపాలని వన్‌టౌన్ పోలీసులను కోరినట్లు తెలిపారు.



గణేశ్ ఎంటర్‌ప్రైజెస్ గోదాం పైఫ్లోర్ మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాల జిల్లా వాసిపై సౌదీలో కేసు



శ్రీనివాస్(ఫైల్)

జగిత్యాల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా బుగ్గారం మండలం గోపులపూర్ గ్రామానికిచెందిన గాజుల శ్రీనివాస్‌పై సౌదీలో కేసునమోదు కాగా అక్కడే చిక్కుకుపోయాడు. శ్రీనివాస్‌కుఫైనల్ ఎగ్జిట్ (దేశం వదిలివెళ్లడానికి అనుమతి) లభించక సౌదీఅరేబియా రాజధాని రియాద్‌లో ఉండిపోయాడు. 12వేల సౌదీరియాళ్ల (రూ.2.8లక్షల భారత కరెన్సీ) దొంగతనం జరిగిందని యజమాని ఫిర్యాదుమేరకు శ్రీనివాస్‌పై మత్లూబ్ (వాంటెడ్ బై పోలీస్) కేసునమోదైంది. 2017లో ఆజాద్‌వీసాపై సౌదీవెళ్లిన గాజుల శ్రీనివాస్ ఎనిమిది ఏళ్లుగా అక్కడే ఉన్నారు. బీపీ, నరాల సమస్యలతో బాధపడుతున్న శ్రీనివాస్‌ను సౌదీ నుంచి ఇండియాకు రప్పించాలని ఆయన కుమారుడు గాజుల సాయికిరన్ హైదరాబాద్ సీఎం ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. భారత్‌కు రావడానికి అడ్డంకిగా ఉన్న మత్లూబ్ కేసు తొలగించేందుకు సహకరించాలని రియాద్‌లోని ఇండియన్ ఎంబసీకి ఇదివరకే రెండుసార్లు విజ్ఞప్తి చేసినట్లు ఆయన కుమారుడు తెలిపారు.

సౌదీలో గుండెపోటుతో వ్యక్తి మృతి



నర్సబోయి(ఫైల్)

ధర్మపురి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురికి చెందిన కొమిరెల్లి నర్సబోయి (50) గుండెపోటుతో మృతిచెందగా మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. జీవనోపాధి నిమిత్తం సౌదీ దేశానికి వెళ్లిన నర్సబోయి ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. నెలరోజులక్రితం గుండెనొప్పితో మృతిచెందాడు. బుధవారం మృతదేహం ధర్మపురి చేరుకోగా కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్యలక్ష్మి, కొడుకు సందీప్, కూతురులు సోని, సిమ్రాన్‌ఉన్నారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక గంగ పుత్ర సంఘం నాయకులు కోరుతున్నారు.

ఇసుక లారీ పట్టివేత

గంభీరావుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్ కాలనీ వద్ద ఇసుకలారీని పట్టుకున్నట్టు ఏఎస్‌ఐ దేవేందర్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన తపాలా మల్లేశం అనే వ్యక్తి కరీంనగర్ నుంచి కామారెడ్డికి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా లారీలో ఇసుక తీసుకవస్తుండగా ఆర్‌ఆర్ నగర్ కాలనీ వద్ద పట్టుకున్నట్టు ఏఎస్‌ఐ వెల్లడించారు. టీఎస్ 02యూబి 7377నంబర్‌గల లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సీజ్‌చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న మల్లేశంపై కేసునమోదుచేసి, లారీనిస్టేషన్‌కు తరలించామ న్నారు.

ఇసుకను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

చందుర్తి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా, ఇసుకను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్‌ఐ రమేష్ బుధవారం తెలిపారు. ఎస్సైకథనం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున పోలీసులపెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ముడపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పల్లెపు శ్రీకాంత్, ఓనర్ పల్లెపు వెంకటేష్‌ను పట్టుకొని విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఎవరి పాత్ర ఎంత?

- కురిక్యాల పాఠశాల వద్ద పోలీసుల బందో బస్తు
- పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ



పాఠశాల వద్ద పోలీసు బందోబస్తు

గంగాధర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కురిక్యాల పాఠశాలలో జరిగిన ఘటనలో ఎవరి పాత్ర ఎంత ఉందనేది తల్లిదండ్రులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ ఘటన వెనక ఎవరెవరున్నారనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. పాఠశాల సమయం నుంచి చివరి గంటవరకు పిల్లలు తరగతి గదుల్లోనే ఉపాధ్యాయుల పాఠాలు వింటుంటారు. ఇంతటి ఘటన జరుగుతున్న పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నా.. ఎవరూ బయట పెట్టక ఎందుకు మౌనంగా ఉన్నారనేది అంతుచిక్కడం లేదు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిలో ఎవరో కొంత సహకారం ఉందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ నివేదిక మేరకు నిందితుడు యాకూబ్ పాషాపై పోక్సో కేసు నమోదు చేసి సస్పెన్షన్ చేయగా ప్రధానో పాధ్యాయురాలిని సస్పెండ్ చేశారు. ఇక అసలు మూలాలను వెతక కుండా ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులందించి చేతులు దులుపుకున్నారని విద్యార్థిసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం త్రిసభ్యకమిటీ సేకరించిన విద్యార్థుల స్టేట్‌మెంట్ ఆధారంగా ఎవరెవరి పాత్రఉంది, ఎంతమందిపై కేసు చేయాల నేది తేట తెల్లమవుతుంది.

● విద్యార్థులకు మనోధైర్యం కల్పించాలి..

మానవత్వ విలువలు తెలియని వ్యక్తులు, బాలికలపట్ల అసభ్యకరంగా వ్యవహరించడం బాధాకరమైన విషయమని మాజీఎమ్మెల్యే బొడిగె శోభ అన్నారు. బుధవారం ఆమె కురిక్యాల పాఠశాలను సందర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో ప్రధానోపాధ్యాయురాలు సహకరిం చడం బాధాకరమైన విషయమ న్నారు. ధైర్యంగా చదువుకోవాలని పాఠశాల విద్యార్థులకు సూచిం చారు. కలెక్టర్ ఈఘటనలో జోక్యంచేసుకుని విద్యార్థుల తల్లిదండ్రు లతో సమావేశం నిర్వహించి వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు.

● కురిక్యాల పాఠశాల వద్ద బుధవారం భారీగా పోలీసులను మోహరించారు. విద్యార్థి సంఘాలు, నాయకులు ఆందోళన చేస్తారన్న సమాచారం మేరకు ముందస్తుగా ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నందున ఎలాంటి ఆటంకం జరగకుండా పోలీసులను మోహరించినట్లు ఎస్సై తెలిపారు.

రైస్‌మిల్లులో పేలిన బాయిలర్

● ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్, కాట్నపల్లి గ్రామాల మధ్యన రాజీవ్‌రహదారి సమీపంలో కనకదుర్గ రైస్‌మిల్లులో బుధవారం ఉదయం బాయిలర్ పేలిపోయింది. భారీ శబ్దంతో పరిసరాలు దద్దరిల్లాయి. ఈ ఘటనలో అక్కడ పనిచేస్తున్న రామస్వామి, కుమార్ అనే ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మిల్లు యాజమాన్యం వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాయిలర్ పేలుడు తీవ్రతకు పైకప్పులు లేచిపోయి, స్లాబ్‌లు, గోడలు, మిల్లులకు సంబంధించిన యంత్రాలు ధ్వంసమయ్యాయి. వీటి శకలాల కింద ఇద్దరు కార్మికులు పడి గాయపడ్డారు. మరోవైపు బాయిలర్‌లో ఉన్న బియ్యంతోపాటు గోదాంలో నిల్వఉన్న ధాన్యం సుమారురూ.2కోట్ల వరకు నష్టం సంభవించినట్లు మిల్లు యజమాని మోరపల్లి తిరుపతిరెడ్డి తెలిపారు. ప్రమాద సమాచారాన్ని అందుకున్న సీఐ సుబ్బారెడ్డితోపాటు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మిల్లు యజమానులతో కార్మికులతో మాట్లాడుతూ ప్రమాద కారణాలను తెలుసుకున్నారు. నాయకులు జైపాల్‌రెడ్డి, చీటి కేశవరావు, పురుషోత్తంరావు, హనుమంత రెడ్డి, మల్లారెడ్డి సదరు రైస్‌మిల్లుకు చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు.

నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా?

బాయిలర్ నిర్వహణలో నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. బాయిలర్ ఉష్ణోగ్రతను నమోదు గమనించాల్సి ఉంటుంది. ధాన్యాన్ని బాయిలర్‌లో పంపిన అనంతరం వేడి తీవ్రతను గమనిస్తూ ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. స్టీమ్ రావడం కోసం వాల్వ్ బంద్ చేసిన ఆపరేటర్ బాయిలర్ వేడి తీవ్రతను గమనించకుండా ఉండటం వల్లనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది.

ఆర్చరీలో స్వర్ణం చేజిక్కించుకున్న చికిత



పతకాలతో చికిత

ఎలిగేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్చరీ క్రీడాకారిణి చికితకు ఆల్ ఇండియా యూనివర్సిటీ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకాన్ని దక్కించుకుంది. పంజాబ్‌లోని బటిండాలో ఈనెల 28నజరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీం ఫైనల్‌లో తానిపర్తి చికిత, ప్రథమేష్ జంట ట్రైకర్ విజయం సాధించిస్వర్ణం గెలుపొందారు. చికితను గ్రామస్తులు అభినందించారు.

బాలిక ఆత్మహత్య

కోరుట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బాలిక(17) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదేకాలనీకి చెందిన మదినం నందీశ్వర్ అనేయువకుడు బాలికను ప్రేమించాలని ప్రతి రోజు వేధిస్తుం డేవాడు. దీంతో మనస్తాపం చెందిన బాలిక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గమనించిన బాలిక తల్లి చుట్టు ప్రక్కల వారికి తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలన జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లుపోలీసులు తెలిపారు.

అభివృద్ధి పథంలో 'శాతవాహన'



- విద్యా బోధనలో సరికొత్త సంస్కరణలు
- 7న రెండో స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న గవర్నర్ జి విష్ణుదేవ్ వర్మ

గణేశ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన విశ్వవిద్యాలయం, బోధన, పరిశోధన, మౌలిక సదుపాయాల కల్పనలో అనేక కీలక సంస్కరణలను అమలు చేస్తూ అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఉపకులపతి ఉమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నవంబరు 7న విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవాన్ని నిరహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జి. విష్ణు దేవ్‌వర్మ హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం యూనివర్సిటీలో పలు మౌలిక సౌకర్యాలు కల్పించారు. పీఎం-ఉషా పథకం కింద బోధన, అభ్యాసంలో పలు మార్పులు తీసుకువచ్చారు. ప్రధాన క్యాంపస్‌లోని అన్ని తరగతి గదులను ఈ-బోర్డులతో ఆధునీకరించారు.



ఎగ్జామినేషన్ బ్రాంచ్ సెమినార్ హాల్

పరిశోధన, రెగ్యులర్ ప్రయోగశాలల కోసం 35 లక్షల విలువైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయ అభివృద్ధికి 100 కోట్ల నిధులు మంజూరు చేసింది. హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల, యూనివర్సిటీ క్యాంపస్‌లో లా కళాశాలల నిర్మాణాల కోసం 66 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు 35 కోట్ల నిధులు విడుదలయ్యాయి. బాలికల హాస్టళ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

● మెగా జాబ్ మేళా

ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో విశ్వవిద్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీ క్యాంపస్, గోదావరిఖని పీజీ కాలేజీలో ఎంసీఏ కోర్సును పునఃప్రారంభించారు. ఎల్ఎండి క్యాంపస్‌లో ఎం ఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను ప్రారంభించారు.



ఎస్‌యూ పారిపాలన భవనం మొదటి అంతస్తును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ (ఫైల్)

యూనివర్సిటీని ఉన్నత ప్రమాణాలకు చేర్చడమే లక్ష్యం.

-ప్రొఫెసర్ వి ఉమేష్ కుమార్, ఉప కులపతి



విశ్వవిద్యాలయాన్ని ఉన్నత ప్రమాణాలకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. నాక్ అక్రిడిటేషన్ సాధించడంపై దృష్టి సారించాము. జాతీయ విద్యా విధానానికి (ఎన్ఈపీ) అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి ఆధారిత కోర్సులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. పాలనా సంస్కరణల్లో భాగంగా, క్యాంపస్‌లో పారదర్శకత, క్రమశిక్షణ కోసం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నాము. రెండో స్నాతకోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాము.



జర్మనీ టెంట్‌లో రాజన్న ప్రచార రథం..



రాజన్న ప్రచారరథం రక్షణ కోసం ఏర్పాటు చేసిన జర్మనీ టెంట్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలోని ప్రచార రథానికి జర్మనీ టెంట్‌ను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనుల్లో భాగంగా రాజన్న ఆలయం ముందు వేపచెట్టు వద్ద భక్తుల దర్శనాల కోసం ప్రచార రథాన్ని నిలిపారు. దీంతో వర్షానికి, ఎండకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఒక భారీ జర్మనీ టెంట్‌తో రక్షణ ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న కార్తీక దీపోత్సవం..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయంతో పాటుగా భీమన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం కొనసాగుతుంది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భీమన్న ఆలయానికి చేరుకున్న భక్తులు పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి పూలతో అలంకరించారు. ఆలయ ఉద్యోగులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు.



వేములవాడ భీమన్న ఆలయంలో కార్తీక దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ముదిరాజ్‌ల రాజకీయ చైతన్యం కోసం కృషి చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల రాజకీయ చైతన్యం కోసం ముదిరాజ్ మహాసభ కృషి చేయాలని మాజీ మంత్రి, ఎంపీ ఈటెల రాజేందర్ సూచించారు. బుధవారం ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గీకురు రవీందర్ తన కార్యవర్గంతో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఆయన శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముదిరాజ్‌లు తమ తెగువ చూపారని అంతేకాకుండా రాష్ట్ర సామాజిక అభివృద్ధిలోనూ విశేషపాత్ర పోషించారని అన్నారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ముదిరాజ్ నాయకుల సమష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ తెలంగాణ సమాజానికి ప్రాతినిధ్యం వహించాలని పిలుపునిచ్చారు. ఈటెల రాజేందర్‌ను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పండుగ నాగరాజు, గౌరవాధ్యక్షుడు కొలగాని నర్సయ్య, ఉపాధ్యక్షులు బండారి నరేందర్, భూమేష్, యువత అధ్యక్షుడు రెడ్డి సరేష్, కోశాధికారి గుంటుక శంకర్, కార్యదర్శి కుంభ మల్లయ్య, ముద్రవేణి కుమారస్వామి పాల్గొన్నారు.



ఈటెల రాజేందర్‌ను కలిసిన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గీకురు రవీందర్, కార్యవర్గం

దాడి చేసిన నిందితుడికి ఏడాది జైలు

జగిత్యాల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడిపై దాడి చేసి కులంపేరుతో దూషించిన కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ కరీంనగర్ మూడో అదనపు సెషన్ కోర్టు అదనపు న్యాయమూర్తి నీరజ తీర్పు చెప్పారు. మేడిపల్లి మండలం కల్వకోట గ్రామానికి చెందిన గోడ వెంకటి అనే వృద్ధుడు గేదెలు మేపడానికి వెళ్ళిన క్రమంలో బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన చందు అనేవ్యక్తి ద్విచక్రవాహనాన్ని వేగంగా నడిపి గేదెను ఢీకొట్టాడు. బైక్‌ను ఎందుకు వేగంగా నడిపావని చందును వెంకటి ప్రశ్నించాడు. నిందితుడు వృద్ధుడిని కులం పేరుతో దూషించి గోడకేసి కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేయగా అప్పటి మెట్‌పల్లి డీఎస్పీ గౌస్‌బాబా దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్ష రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గౌస్ బాబా, పిపి ఝాన్సీ, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ ఉదయ్, సీఎంఎస్ కానిస్టేబుల్ సుమలతలను ఎస్పీ అభినందించారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 62మంది రైతులు 579క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 34క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాటద్వారా గరిష్ఠ ధర రూ.7వేలు, కనిష్ఠధర రూ.6వేలు చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు.

కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ముగ్గురు రైతులనుంచి 65క్వింటాళ్ల పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముత్తారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేటకు చెందిన రాయినేని గట్టయ్య లక్ష్మిల కుమారుడు రాయినేని రాకేష్(25) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈనెల 28న గడ్డిమందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు.



రాకేష్(ఫైల్)

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దారం శ్రీనివాస్

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆడిట్‌శాఖ రాష్ట్రసంచాలకుడు మార్తవేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లాపర్యటనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆన్‌లైన్ ఆడిట్ ద్వారా రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా నిలిపిన అధికారి మార్తవేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పోరిక రాము, జిల్లా స్టేట్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ రంజిత చికిలే, డిప్యూటీ డైరెక్టర్ వేణు మాధవరెడ్డి, సుచేత, బోయల్ త్రినాథ్, దత్తు, ఆడిట్ ఉద్యోగులు, టీఎన్‌జీవో నాయకులు పాల్గొన్నారు.

బాబ్లీ గేట్ల మూసివేత

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను త్రిసభ్యకమిటీ పర్యవేక్షణలో బుధవారం మూసివేశారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుప్రకారం ప్రతీయేటా జూలై 1న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెరిచి అక్టోబరు 29న మూసివేస్తారు. దీనిప్రకారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు, నాందేడ్ ఇరిగేషన్ అధికారులు, సీడబ్ల్యూసీ అధికారుల బృందంతో కూడిన త్రిసభ్యకమిటీ సమక్షంలో బాబ్లీగేట్లను మూసివేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్పీ ఎస్ఈ జగదీశ్, సీడబ్ల్యూసీ ఈఈ ఫ్రాంక్లిన్, నాందేడ్ ఈఈ సీఆర్ బాన్‌సోడ్, ఎస్ఆర్ఎస్పీ పోచంపాడ్ ఏఈఈ కొత్త రవి, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సత్తీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా బాబ్లీప్రాజెక్టు ఎగువన వర్షం కురుస్తుండడంతో వస్తున్న వరద నీరు వల్ల కొన్నిగేట్లు వరద ప్రవాహం ఉన్నంతవరకు తెరిచి ఉంచబడుతాయని అధికారులు ప్రకటించారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు రావడం బుధవారం పెరిగింది. ఎగువప్రాంతం నుంచి 59,654క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 50వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 80.501టీఎంసీల నీరునిల్వ ఉంది. కాకతీయకాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 59,654 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

మిడ్ మానేరుకు భారీగా ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: మొంథా తుపాన్ ప్రభావం వల్ల బుధవారం కురిసిన వర్షానికి శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్‌మానేరు) బుధవారం 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ ద్వారా వరద నీరువచ్చి చేరుతోంది. అయితే ప్రాజెక్టుపూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు 13175వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.79 సామర్థ్యం 27.55టీఎంసీలకు 27.042టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి

- ఇకపై కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీచేసి శాఖలవారీగా చర్యలు తీసుకోవాలి
- కేంద్ర పథకాలపై ప్రతినెలా ప్రగతి నివేదిక మీడియాకు ఇవ్వండి
- పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నా.. ప్రజలకు తెలుపకపోతే ఎలా?
- కరీంనగర్‌లో యూజీడీ పేరుతో నిధులన్నీ నాశనం చేశారు
- కష్టపడి నిధులు తెచ్చా... కార్పొరేషన్‌లో ఎంపీ ల్యాడ్ గ్రౌండింగ్‌లో జాప్యమెందుకు?
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం సహించరానిది
- అమృత్ పూర్తి బాధ్యత కమిషనర్ దే
- 'దిశ' సమీక్షలో అధికారులపై కేంద్రమంత్రి హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'కేంద్రం నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా కరీంనగర్ పార్లమెంట్‌కు నిధులు తెస్తున్నా.. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో, సహకారంతో పనిచేస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుంది. కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నా ప్రజలకు తెలియజేయకపోతే ఎలా..., కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీచేసి శాఖలవారిగా చర్యలు తీసుకోవాలి.. కేంద్ర పథకాలపై ప్రతినెలా ప్రోగ్రెస్ రిపోర్టును మీడియాకు రిలీజ్‌చేయాలి' అని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి, జిల్లాఅభివృద్ధి కో ఆర్డినేటషన్ అండ్‌మానిటరింగ్ కమిటీ(దిశ) చైర్మన్ బండి సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అనేక నిధులు మంజూరు చేయించి పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఏ పార్టీకి చెందినవారైనా నియోజకవర్గ అభివృద్ధికి, సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. కేంద్రప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధిపనులు జరుగుతున్నాయన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కరీంనగర్ అభివృద్ధికి రూ. 851 కోట్ల నిధులు

ఇప్పటి వరకు 851కోట్ల రూపాయల ఎంపీ నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని (యుజీడీ) అట్టర్‌ప్లాఫ్ చేశారని, గుంతలు తవ్వి వదిలివేశారని, నిధులన్ని సర్వనాశనం చేశారని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి నిధులు తీసుకువస్తే ఎంపీ ల్యాడ్ గ్రౌండ్ కావడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత్ స్కీమ్ పూర్తి పర్యవేక్షణ, బాధ్యత మీదేనని కమిషనర్‌కు సూచించారు. నగరపాలక సంస్థ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాక కట్టెల పొయ్యిపై ప్రజలు ఎందుకు వండుతున్నారని, వీటిపై ప్రజలకు ఎందుకు అవగాహన కల్పించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో ఆర్అండ్‌బీ పనులు నత్తనడకన నడుస్తున్నాయని, అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లు సిండికేటై ప్రజలను ఇబ్బంది పెడుతుంటే ఏమి చేస్తున్నారని నిలదీశారు.

తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులు ఇంకెన్నాళ్లు?

తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారని, ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా మీకు పట్టింపు లేదా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గన్నేరువరం నుంచి బెజ్జంకి రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని, నిరంతరం అధికారులు క్షేత్రస్థాయిలో ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా విశ్వకర్మ, పీఎంఈజీపీ రుణాలెందుకు ఇవ్వడం లేదని అడిగారు. తనఖా లేకుండా రూ.25లక్షల్లోపు రుణాలు ఇవ్వాలని నిబంధనలు ఉన్నా ఎందుకు పట్టించుకోరని బ్యాంకర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంటనే బ్యాంకర్లతో మాట్లాడి రుణాలిప్పించాలని సూచించారు. దీనిపై కలెక్టర్లు సంబంధిత శాఖల అధి కారులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాట వినని బ్యాంకుల వద్దనున్న డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని సూచించారు. తాను కిందిస్థాయినుంచి ఎదిగిన వ్యక్తినని, ఎప్పుడు రూల్స్‌కు వ్యతిరేకంగా పనిచేయాలని చెప్పనని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారంపై తమ ఆఫీసునుంచి లేఖ పంపితే కొందరు రిప్లయి కూడా ఇవ్వడం లేదని, ఇకపై అలాచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన సిబ్బందిని, వైద్యులను నియమించాలన్నారు. గతంలో లక్షలాది రూపాయలతో అంబులెన్సులను ఆసుపత్రులకు ఇస్తే వాటిని మూలనపడేశారని, దీంతో ఆటోల్లో మృతదేహా లను తీసుకెళ్ళారని, తాను నిధులు తెచ్చి ఏమి ప్రయోజనమని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 15వేలసైకిళ్లను ఉచితంగా అందజేశామని, మరో ఐదువేల సైకిళ్లను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈకార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ తగ్గాయని మంత్రి తెలిపారు.

కేంద్ర నిధులు మళ్లిస్తే కఠిన చర్యలు

పీఎంశ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్ళించినట్లు తెలిసిందని, కేంద్రం నిధులను మళ్ళిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను కేంద్రహోం శాఖ సహాయమంత్రి బండిసంజయ్ హెచ్చరించారు. ప్రభుత్వపాఠశాలల్లో మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీ నిధుల ద్వారా మంజూరైన పనులన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. గన్నేరువరం బ్రిడ్జి కోసం సేతు బంధన్ పథకం ద్వారా 77కోట్ల రూపాయలను మంజూరు చేయించానని, ఆ పనులను వేగంగా పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రానున్న నాలుగుసంవత్సరాల కాలానికి సరిపడామందుల ఇండెంట్ తనకు సమర్పించాలని, నిధులు సమకూరుస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలి

ఆయుష్మాన్ భారత్‌రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు రోజువారీ నివేదిక సమర్పించేందుకు ఉచితంగాట్యాబ్ అందజేస్తామని సంజయ్ తెలిపారు. సోలార్‌పవర్ వినియోగం పెంచేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

● పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తన క్షేత్రస్థాయి పర్యటనలో అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని అసంతృప్తిని వ్యక్తం చేశారు. కస్తూర్బా పాఠశాలల్లో సిబ్బంది వేతనాలను పెంచాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని సూచించారు. బడిమానేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

● కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. విద్యవైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలు ఈపథకాలను సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారుల్లో ఉందని అన్నారు. సమావేశంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

జిల్లాలో ఎడతెరిపి లేని వర్షం


మడక వాగులోకి వెళుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎస్ఐ

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ధాన్యాన్ని కుప్పలుగా పోసుకున్నారు. భారీ వర్షంతో వ్యవసాయ మార్కెట్ స్థలం ఎత్తు వంపలుగా ఉండటంతో వర్షానికి తడిసిన ధాన్యం కొట్టుకుపోయింది. రైతులు ధాన్యంపై కవర్లు కప్పినప్పటికీ భారీ వర్షంతో కవర్ల లోపలి నుంచి నీరు ప్రవహించి ధాన్యం కొట్టుకుపోయింది. గాలివాన కారణంగా కోతకు వచ్చిన వరి నేలరాలినట్లు రైతులు పేర్కొన్నారు. పత్తి కూడా తడిసిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి పత్తి, వరి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో మండల పరిధిలోని రైతులకు భారీ నష్టం వాటిల్లింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పత్తి, వరి పంటలు చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలతో అపార నష్టం కలిగిస్తుంది. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి చేనులోకి వరద నీరు రావడంతో పంటలు జలమయమయ్యాయి. కొన్ని గ్రామాల్లో రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోయింది. మరికొందరు రైతులు హార్వెస్టర్లతో వరి కోస్తున్న సమయంలో అనుకోకుండా కురుస్తున్న వర్షాలతో హార్వెస్టర్లతో మొరాయించి పంట చేన్లలోనే నిలిచిపోయాయి. చిన్నసన్నకారు రైతులతోపాటు కౌలు రైతులు పెట్టిన పెట్టుబడులు వస్తాయో రావోనని విచారం వ్యక్తం చేస్తున్నారు.


కాల్వశ్రీరాంపూర్‌లో కొట్టుకుపోతున్న ధాన్యం

అకాల వర్షంతో నేలకొరిగిన వరి

- కొప్పు తిరుపతి యువ రైతు గుడిపెల్లి



ఐదెకరాల పొలంపైననే ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. సమయానికి క్రిమిసంహారక మందులు దొరకక ఇబ్బంది పడ్డాం. తీరా పంట చేతికి వచ్చే సమయానికి కురుస్తున్న అకాల వర్షంతో వరి నేలకొరిగింది. అప్పులు చేసి పండించిన పంట చేతికి రాకపోతే పంటపై చేసిన అప్పులు తీరడం కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మంథని/మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మంథని ప్రాంతంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షానికి తోడు ఈదురు గాలులు వీచాయి. మంథని ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో వరి, పత్తి పంటలకు తీరని నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. పూర్తి స్థాయి గొలుసు, కోత దశల్లో ఉన్న వరి ఎడతెరిపి లేని వర్షానికి, ఈదురు గాలులకు నేల వాలిపోయింది. వరి కంకి ఉన్న గింజలు నేల రాలిపోయాయి. కాతకు వచ్చిన పత్తి కాయలు సైతం వర్షానికి తడిసి దెబ్బతిన్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంటలను వర్షాలు దెబ్బతిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షంతో మంథనిలోని రోడ్లు, బస్టాండ్, లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళే ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం బయటకు రావటానికి జనం సైతం అవస్థలు పడ్డారు. చలి కారణంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఇక్కట్లకు గురయ్యారు.


గుడిపెల్లిలో నేలకొరిగిన వరిపంట

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షంతోపాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. వరి పంట చేతికి అందె దశలో తుఫాను దాటికి నేలవాలిపోయాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి, కౌలు తీసుకొని పంటలు సాగు చేసిన తరుణంలో అకాల వర్షాల వల్ల పంట దెబ్బతినడంతో ఆవేదన చెందుతున్నాడు. ముప్పిరితోట, ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి, లోకపేట గ్రామాల్లో వేసిన పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగింది. గ్రామాల్లో అంతర్గత, బహిర్గత రోడ్లన్ని బురదమయంగా మారాయి.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భారీ వర్షం కురుస్తుంది. దీంతో రోడ్లన్నీ జలమయం కాగా ప్రధాన నాలాలు పొంగి ప్రవహిస్తున్నాయి. జీడీకే 5ఇంక్లైన్, 2ఇంక్లైన్ వంతెనల వద్ద భారీగా నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కళ్యాణ్‌నగర్, అడ్డగుంటపల్లి, చౌరస్తా, గాంధీనగర్, విఠల్‌నగర్, తిలక్‌నగర్ ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం వల్ల మండలంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వరి పంటలు గాలి,వానకు నేలమట్టమయ్యాయి. అలాగే పత్తి సైతం వర్షానికి తడిసి ముద్దయ్యాయి. చేతికి అంది వచ్చిన పంటలు తుఫాన్ పాలవడంతో రైతులు ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదు. భారీ వర్షం వల్ల గ్రామాల్లోని వీధులు జలమయమయ్యాయి. చెరువులు,కుంటల్లోకి వరద ఉధృతి పెరుగుతుంది.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి, ఈదురు గాలులకు కోత కొచ్చిన వరి పంటలు దెబ్బతింటున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దవుతోంది. వర్షాలతో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలాయి. గింజలన్ని నీళ్లలో తడిసి పోతున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న పత్తి వర్షానికి తడిసి రంగు మారుతుంది.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. వరి పంట చేతికి అందె దశలో తుఫాను దాటికి నేలవాలాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి, కౌలు తీసుకొని పంటలు సాగు చేసిన తరుణంలో అకాల వర్షాల వల్ల పంట దెబ్బతిన్నది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందించి వచ్చే సమయంలో అపార నష్టం కలిగించదంటూ మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగింది.


విలోచవరం శివారులో దెబ్బతిన్న పత్తి పంట, ఓదెలలో రోడ్డుపై పారుతున్న నీరు

జోరు వాన

(5వ పేజీ తరువాయి)

గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు. ఇప్పటికే ఎస్సారెస్పీ అధికారులు ప్రకటించిన మేరకు కేశవపూర్, గుండ్లపల్లి, కనగర్తి, మడక, పొత్కపల్లి, రూపు నారాయణపేట, ఇందుర్తి, బాయమ్మపల్లి, గుంపుల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులోకి ఎవరు దిగే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. మానేరు వాగులోకి చేపల వేటకు వెళ్ళవద్దని సూచించారు. పరివాహక గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు హెచ్చరికలు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాయిలర్ పేలుడుపై ఎంపీ ఆరా

సుల్తానాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాట్నపల్లి గ్రామంలోని కనకదుర్గ రైస్ మిల్లులో భారీ పేలుడు జరిగిన విషయంపై ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ఆరా తీశారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణతో ఫోన్‌లో మాట్లాడి, జరిగిన ప్రమాదానికి కారణాలు, ప్రస్తుత పరిస్థితి, గాయపడిన వారు ఎలా ఉన్నారని వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందేలా అధికారులకు సూచనలు చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మెరుగైన వైద్యం అందించాలి

కాట్నపల్లిలోని కనకదుర్గ రైస్‌మిల్లులో బాయిలర్ పేలిన ప్రమాదంలో గాయపడిన కార్మికులు రామస్వామి, కుమార్‌లకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాయిలర్ పేలుడు వల్ల కార్మికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని, గాయాలతో అంగ వైకల్యం చెందుతున్నారని, కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సబ్బితంలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మహిళలు డప్పు చప్పుళ్ల నడుమ గొడుగులు పట్టుకొని బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి ,మొక్కులు చెల్లించారు.

పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు

పెద్దపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యుఐడిఎఫ్) ద్వారా 62 కోట్ల 23 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ జీవో 732 విడుదల చేసిందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో ఎనిమిది ప్యాకేజీల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతామని వివరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కార్యాచరణ అమలు చేస్తున్నట్టు వివరించారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. నిధుల మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

హరీష్‌రావును పరామర్శించిన నాయకులు

పెద్దపల్లి/కోల్‌సిటీ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి చెందగా ఆయనను పలువురు నాయకులు కలిశారు. బుధవారం ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి పరామర్శించారు. అలాగే గోదావరిఖనికి చెందిన బీఆర్ఎస్ అధికారప్రతినిధి జిట్టవేన ప్రశాంత్, మేదరిసంఘం నాయకులు సమ్మయ్యలు కలిసి పరామర్శించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

కమాన్‌పూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సాధినేని ప్రియాంక బుధవారం బాధ్యతలు చేపట్టారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి జాయినింగ్ లెటర్ తీసుకొన్నారు. ముత్తారం ఎంపీ డీఓ లలిత ఇన్‌చార్జిగా ఇక్కడ ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓకు ఎంపీఓ మారుతి, కార్యదర్శులు, అధికారులు పుష్పగుచ్చాలు అందించారు. కార్యదర్శులు అంబటి శంకర్, రాంమోహన్ , టైపిస్టు సుజాత, సిబ్బంది సుమన్, మేడగొని శ్రీనివాస్‌లు ఉన్నారు.

లక్కారం యూత్ కార్యవర్గం

ముత్తారం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): లక్కారం గ్రామయూత్ కాంగ్రెస్ కమిటీని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినీత్, గ్రామ కమిటీ ఎన్నిక ఇంచార్జి బియ్యని శివకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొడ్డేటి హరీష్, ఉపాధ్యక్షుడిగా ఐతంరాజు, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కార్యదర్శి బాషవేన అశోక్, కోశాధికారిగా కుమార్, అధికార ప్రతినిధిగా దొంతరవేన రాజు, ప్రచార కమిటీ కన్వీనర్‌గా పలువురిని ఎన్నుకున్నారు.

ఐకేపీ కేంద్రంలో ఏఈ పరిశీలన

రామగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం విద్యుత్‌శాఖ ఏఈ మహేందర్‌రెడ్డి పరిశీలించారు. కేంద్రానికి అవసరమయ్యే ఆరు లెవెన్ కేవి పోల్స్ ఆరు ఎల్టీ పోల్స్ అవసరం ఉంటుందని పేర్కొన్నారు. సత్వరం పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

సింగిల్ విండో మాజీ చైర్మన్ పీర్ మహ్మద్ మృతి


పీర్ మహ్మద్ (ఫైల్)

ధర్మారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నందిమేడారం సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎండీ పీర్ మహ్మద్ అనారోగ్యంతో కన్నుమూశారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతున్న పీర్ మహ్మద్‌కు గుండెపోటు రావడంతో మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మేడారం గ్రామానికి చెందిన పీర్ మహ్మద్ కాంగ్రెస్‌తో రాజకీయం మొదలైనప్పటికి 1983లో టీడీపిలో చేరి క్రియాశీల నాయకుడిగా కొనసాగారు. 1985లో సింగిల్ విండో చెర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల అన్ని పార్టీల నాయకులు విచారం వ్యక్తం చేశారు. మృతుడికి బార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ పీర్ మహ్మద్ హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విచారం వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులకు అండగా ఉండేం దుకు తక్షణ సహాయం కింద 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని ఏఎంసీ చైర్మెన్ రూప్లా నాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్యలకు సూచించారు. మంత్రి ఆదేశాలతో కుటుంబ సభ్యులకు అందజేశారు. బొల్లి స్వామి, ఉత్తమ్ రాజయ్య, ఆవుల రాజేశం, కమలేష్, ఇరెపల్లి శ్రీను, మగ్గిడి తిరుపతి, ఎండీ బషీర్, పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని చూపాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవ వేడుకల్లో భాగంగా గత నెలలో పాఠశాలలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోరాణిస్తూ ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. నూక రమేష్, సుబ్బారావు, మల్లయ్య, బాణాల లక్ష్మీనాఆరాయణ, ధరణి లక్ష్మణ్, అనంతుల రాజు, భాస్కర్, స్పందన స్కూల్ హెచ్ఎం ఓదెలు, రవీందర్, కృష్ణవేణి టాలెంట్‌స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు ఎంపిక

రామగిరి, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైంది. సత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మోత్కూరి హన్సిక రాష్ట్ర స్థాయికి వ్యాసరచన పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా 8వ కాలనీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నూక రమేశ్ విద్యార్థికి సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపికను అందజేసి అభినందించారు. సత్యసాయి జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సేవాదళ్ కో-ఆర్డినేటర్ హన్మంతరావు, మెడికల్ కో-ఆర్డినేటర్ సుబ్బారావు, మల్లయ్య లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ఏరియాలో మద్యం షాపులు వద్దు

కోల్‌సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల విస్తరణ, కూడళ్ల అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా ఆ ప్రాంతాల్లో కొత్తగా మద్యం దుకాణాలు పెట్టవద్దని, ప్రత్యామ్నాయ లొకేషన్లు చూసుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ఎఫ్‌సీఐ చౌరస్తా, మేడిపల్లి చౌరస్తా ఏరియాను కూడళ్ల అభివృద్ధి చేస్తున్నారు. అలాగే సీతానగర్, గంగానగర్ సర్వీస్ రోడ్ ఏరియా, బస్టాండ్ ఏరియా, రమేష్‌నగర్ చౌరస్తా ఫైవింక్లయిన్ ఏరియా, మార్కండేయకాలనీ, జ్యోతిరావు పూలే విగ్రహం ప్రాంతాల్లో కొత్తగా షాపులు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్‌లో విస్తరణ జరిగిన సమావేశంలో వ్యాపారాలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఈ సారి ఎక్సైజ్ పాలసీలో రెండు సెక్టార్లుగా విభజించారు. దీని ప్రకారం ఈ సెక్టార్లలో ఎక్కడ మద్యం షాపు వచ్చినా ఆయా సెక్టార్ పరిధిలోని ఏ డివిజన్లలోనైనా పెట్టుకునే అవకాశం ఉంది. ఈ సెక్టార్ల ఏర్పాటుతో ఒక సెక్టార్ పరిధిలో షాపు దక్కించుకున్న వారు ఆ సెక్టార్ పరిధిలోని ఏ డివిజన్‌లోనైనా షాపు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. డిసెంబర్ 1వ తేది నుంచి కొత్తగా షాపులు ఏర్పాటు చేయనున్నారు.



బహుముఖ విస్తరణతోనే సింగరేణి భవిష్యత్


మాజీ సీఎండీ ఏపీవీఎన్ శర్మను సన్మానిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

గోదావరిఖని, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి పనిలో పారదర్శకత ఉన్నప్పుడు విజిలెన్స్ అవసరం అంతగా ఉండదని సింగరేణి సంస్థ మాజీ సీఎండీ ఏపీవీఎన్ శర్మ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో బుధవారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. సీఎండీ బలరామ్ మాట్లాడుతూ 1998ప్రాంతంలో మూసివేతకు చేరువగా వెళ్ళిన సింగరేణి సంస్థకు ఏపీవీఎన్ శర్మ ప్రాణ ప్రతిష్ఠ చేశారన్నారు. సింగరేణి ఒడిశాలో బొగ్గు బ్లాక్‌ను ప్రారంభించిందని, రాజస్థాన్ రాష్ట్రంతో కలిసి సోలార్, థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తుందని, కర్ణాటకలో బంగారం, రాగి అన్వేషణ జరుపుతోందని తెలిపారు. ఏపీవీఎన్ శర్మను ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్మెంట్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బీ వెంకన్న జీఎం(కో ఆర్డినేషన్) టీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌జీ-1 ఏరియా స్థాయి స్ట్రక్చర్ సమావేశం


సమావేశంలో పాల్గొన్న అధికారులు, యూనియన్ నాయకులు

గోదావరిఖని, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా స్థాయి స్ట్రక్చర్ మీటింగ్ బుధవారం జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులతో జరిగింది. జీఎం లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 5ఇంక్లైన్ ఏరియాలో ఉన్న సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను నడపించాలని, 11 ఇంక్లైన్ కార్మికులు డ్యూటీకి వెళుతున్న దారిలో సీసీ రోడ్డు వేయాలన్నారు. యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు 190 మస్టర్లు గత మూడు సంవత్సరాలలో ఏదో ఒక సంవత్సరంలో ఉండాలనే నిబంధన లేకుండా అర్హత ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి ఆరెల్లి పోషం, ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్, ఏజంట్ చిలుక శ్రీనివాస్, ఎల్ రమేష్, ఓసీపీ-5 ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఏజీఎం(ఐఈడీ) అంజనేయులు, అధికారులు బీమా, జితేందర్ సింగ్, వరప్రసాద్, ధన లక్ష్మీ భాయి, ఫైడిశ్వర్, సీనియర్ పీఓలు శ్రావణ్ కుమార్, హన్మంత రావు, వీరారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీను, మాదన మహేష్, వెంకటరెడ్డి, సిద్దమల్ల రాజు, విజయ లక్ష్మి, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-2 ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో బుధవారం డీజీఎం పర్సనల్ పి.అరవింద్‌రావు సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డ్స్, ఉద్యోగి పదవీ విరమణ చేసిన రోజునే అందించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గైర్హజరుపై నూతనంగా విడుదలైన సర్క్యులర్ గురించి సంక్షేమ అధికారులకు వివరించారు. కోర్టు కేసులు, ఉద్యోగుల ప్రమోషన్ల అంశాలను సమీక్షించారు. డీవైపీఎంలు వేణుగోపాల్, వంశీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎస్.సాధన్, సంక్షేమ అధికారులు సాయికృష్ణ, అజీజ్,నరేష్ పాల్గొన్నారు.

ఏఎల్‌పీ గని సమస్యలపై మేనేజర్‌తో బీఎంఎస్ చర్చ

రామగిరి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పి గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం పై బుధవారం గని మేనేజర్ పెంచలయ్యతో బ్రాంచ్ సెక్రటరీ రౌతు రమేశ్, బీఎంఎస్ నాయకులు చర్చించారు.. పలు సమస్యల పరిష్కారం కోరుతూ డిమాండ్‌లతో వినతి పత్రం అందజేశారు. నాయకులు పూన్నమనేని వేణుగోపాల్‌రావు, అరుకల ప్రసాద్, మీనుగు సంతోష్, జాడి వెంకటేష్, చాట్ల వెంకటేష్, రాయవేణి రమేశ్, బీమరి సంతోష్, హరీష్, రాజు, తిరుపతి, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు 2కే రన్

ఎలిగేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుంచి ధూళికట్ట బస్టాప్ వరకు 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ మదుకర్ తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో యువతీ, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ధర్మారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అనిత సూచించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గల విద్యార్థులకు రక్త పరీక్షలు, బలహీనంగా ఉన్న పిల్లలకు బి విటమిన్ మాత్రాలు అందించారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, కూరగాయలు, పండ్లు, పాల పదార్థాలు ఎక్కువగా ఉండేటట్లు చూసుకోవాలని కోరారు. జంక్ ఫుడ్ మానేయాలని, సెల్ ఫోన్ వినియోగం తగ్గించాలని సూచించారు. హెచ్ఎం నూతి మల్లయ్య, డాక్టర్ మల్లేష్, ఏఎన్ఎం సఫియా, ఫార్మసిస్ట్ మమత తదితరలు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు భాను సూచించారు. లక్ష్మీపురం కమ్యూనిటీహాల్‌లో ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు మందులను అందజేశారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి కందుల సతీష్, నాయకులు మెండె మహేందర్, సత్యనారాయణ, మెట్టు సుమన్, మహ్మద్ గౌస్, లక్ష్మీపురం, ఎల్కపల్లి గేట్ వాసులు పాల్గొన్నారు.

నేడు జేఎన్టీయూలో ఈవేస్ట్ పై హ్యాకథాన్

రామగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఈవేస్ట్‌పై హరితాన్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెమినార్‌కు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్ సిహెచ్ శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లు వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

పునరుజ్జీవ పంట ఉత్పత్తిపై రైతులకు శిక్షణ

ముత్తారం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): లక్కారంలో బుధవారం ఆర్‌పి ప్రాజెక్టులో భాగంగా రైతులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్ మాట్లాడుతూ పునరుజ్జీవ పంట ఉత్పత్తిపై వివరించారు. కవర్ క్రాపింగ్ సంరక్షణ పద్ధతులు, పంట మార్పిడి, అంతర్ పంటలు, రసాయన ఎరువుల తగ్గింపుపై వివరించారు. పత్తి సేకరించేటప్పుడు, నిలువ, రవాణా సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణను అందించారు. వేప నూనె, పీఎస్‌బి లింగాకార్షక బుట్టలు, జిగురు అట్టలు, విటాప్రో, కేవీపీఈ కిట్లు అందించారు. జీపీ కార్యదర్శి దిలీప్, క్షేత్ర పరిశీలకులు రాజశేఖర్, రాజు, రైతులు పాల్గొన్నారు.

పుట్ట మధు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

మంథని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు మంథనిలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల కనీస అవసరాలను తీర్చ లేదన్నారు. అన్‌సాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల రాజయ్య, మాజీ సైనికుడు బానోత్ రాజ్‌కుమార్, లావుడియా రాణాసింగ్, ఇంజపూరి కుమార్ యాదవ్, సీనియర్ నేతలు ధరంసోత్ లక్ష్మణ్ నాయక్, లావుడ్య రాజు, తొట్ల సమ్మయ్య ఉన్నారు.

ఆలయంలో గోమాతకు పూజలు

మంథని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఆవరణలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గోపాష్టమి వేడుకలను బుధవారం నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేతలు అడిగొప్పుల రాజు, కొత్త శ్రీనివాస్, రావుల సతీష్, బోట్ల అంజనేయులు, సత్యనారాయణ, మేడగోని రాజమౌళిగౌడ్, హరీష్, పాల్గొన్నారు.

రోడ్లపై గేదెలు తిరిగితే జరిమానా

కోల్‌సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పశువులను రోడ్లపై వదిలి పెడితే యజమానులకు రూ.10వేల జరిమానా విధిస్తామని కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లపై సంచరిస్తున్న గోవులను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సజయ్ గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన గోశాలకు తరలించి సంరక్షిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 77పశువులను గోశాలకు తరలించగా యజమానులు అపరాధ రుసుము చెల్లించి 31పశువులను విడిపించుకుని వెళ్లారన్నారు. ఇక నుంచి రోడ్లపై తిరిగిన గేదెలు, గోవులు, పశువులను గోశాలకు తరలిస్తామని, విడిపించుకోవాలంటే యజమానులు రూ.10వేల జరిమానాతో పాటు రోజుకు రూ.250 చొప్పున నిర్వహణ రుసుం చెల్లించాలన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను వాటి యజమానులు తమ ఇండ్లకు తీసుకెళ్ళాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో పశువులను గోశాలకు తరలిస్తామన్నారు. గోశాలకు తరలించడంతో పాటు యజమానికి పది వేల రూపాయల జరిమానా విధిస్తామన్నారు.

ఇందిరమ్మ గృహ నిర్మాణాలను పరిశీలించిన సీఈవో


అధికారులతో సమావేశమైన సీఈవో

రామగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రత్నాపూర్, కల్వచర్ల గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలను బుధవారం జెడ్‌పి సీఈవో నరేందర్ పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో శైలజా రాణి, సూపరిండెంట్ ఉమేష్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ రేఖ, పంచాయితీ సెక్రటరీలు సంతోష్ , శ్రీధర్ పాల్గొన్నారు.

'రాజ్‌కుమార్ మృతితో నాకు సంబంధం లేదు'

మంథని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదకాలనీలో ఆత్మహత్య చేసుకున్న శీలం రాజేశ్వరీ-దేవేందర్ దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ మృతితో తనకు ఎలాంటి సంబంధం లేదని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది శ్రీపాదకాలనీలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హమాలీలకు, రాజ్‌కుమార్ మధ్య ఉన్న పాత కక్షలతో గొడవ పడి ఒకరిపై ఒకరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకొన్నారని తెలిపారు. గొడవలో తాను జోక్యం చేసుకోలేదన్నారు. రాజ్‌కుమార్ మృతి సంఘటనపై పోలీసులు పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా దేవేందర్

ఎలిగేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ కన్వీనర్‌గా కవ్వంపల్లి దేవేందర్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా తీట్ల శ్రీనివాస్, రాయపాక లక్ష్మణ్, కవ్వంపల్లి సరోజన, స్వరూప, గోసిక నాగలక్ష్మి, నంబయ్య, ప్రవీణ్‌లు ఉన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు సహకరించిన వారందరికి దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.